జోరుగా బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం

బీర్కూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నస్రుల్లాబాద్, మే 1 : బీర్కూర్‌లో బుధవారం బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం జోరుగా కొనసాగింది. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా మండల కేంద్రంలో ఎంపీపీ రఘు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు సందీప్, పార్టీ గ్రామ అధ్యక్షుడు రాజు, నాయకులు గంగారాం, శశికాంత్, లాయక్ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలి

కామారెడ్డి, మే 1 : కామారెడ్డి జిల్లాలో రోజురోజుకూ అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న దృష్ట్యా ప్రజలు వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవసరమైతే తప్ప ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు బయటికి రావొద్దన్నారు. ప్రయాణాలు తెల్లవారుజామున వెళ్లేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. బయటికి వెళ్లేటప్పుడు తప్పనిసరిగా టోపి లేదా తలపాగా ధరించాలని, గొడుగులు సైతం తీసుకెళ్లాలని సూచించారు. వృద్ధులు, చిన్నారులు నీడపట్టునే ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ శరీరంలో నీటి శాతం తగ్గకుండా రోజూ బాగా నీరు తాగాలని, నలుపు, ముదురు రంగు దుస్తులు ధరించొద్దని తెలిపారు. బయటికి వెళ్లేటప్పుడు తప్పక వాటర్ బాటిల్ తీసుకెళ్లాలని, మజ్జిగ, కొబ్బరి బొండాలు, ఓఆర్ఎస్, నిమ్మరసం వంటివి తాగడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని అన్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలకు నీడ కల్పించడం, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని, వడదెబ్బ లక్షణాలు కనిపించిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సైబర్ క్రైం డీఎస్పీ శ్రావణ్

కామారెడ్డి, మే 1 : జిల్లా కేంద్రంలోని మంజీరా పీజేఆర్ స్నాతకోత్తర డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ క్రైం నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సైబర్ క్రైం డీఎస్పీ శ్రవణ్ హాజరై మాట్లాడుతూ.. అమ్మాయిలు ఎలా జాగ్రత్తగా ఉండాలో వివరించారు. సమస్యలు వచ్చినప్పుడు ఏ విధంగా పరిష్కరించుకోవాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై స్రవంతి, కళాశాల చైర్మన్ గురువేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, షీటీం బృందం, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' జోరు

పెద్ద సంఖ్యలో హాజరవుతున్న కూలీలు

మాందాపూర్‌లో గ్రామంలో చేపట్టిన ఉపాధిహామీ పనులకు హాజరైన కూలీలు

బీబీపేట్, మే 1 : మండలంలో ఉపాధి హామీ పనులు ఊపందుకున్నాయి. యాసంగి పనులు దాదాపు ముగియడంతో కూలీలు పెద్ద సంఖ్యలో ఉపాధి హామీ పనులకు వెళ్తున్నారు. మండల కేంద్రంతోపాటు మాందాపూర్, జనగామ, యాడారం, కోనాపూర్, తుజాల్‌పూర్, మాల్కాపూర్ గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయి. ప్రతి గ్రామంలో 250 మంది కూలీలు హాజరయ్యేలా అధికారులు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. ఎండలు ఎక్కువగా ఉండడంతో ఉదయం పూటనే పనులు చేపట్టేలా చూస్తున్నారు. పని ప్రాంతంలో కూలీలకు తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుతున్నారు. మండలంలోని ప్రజలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

6066 మందికి జాబ్ కార్డులు..

బీబీపేట్ మండలంలో మొత్తం 6066 మందికి ఉపాధిహామీ బాబ్ కార్డులు ఉన్నట్లు ఏపీవో రజని తెలిపారు. ప్రస్తుతం 9984 మంది యాక్టివ్ వర్కర్స్ ఉన్నారని, మండలంలోని అన్ని గ్రామాల్లో కలిపి 1739 మంది కూలీలు పనులు చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధిహామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన

డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

ఇస్లాంపూర కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, మే 1 : బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డు ఇస్లాంపూర కాలనీలో మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్ రూం ఇండ్లను ఆయన పరిశీలించారు. స్థానిక సమస్యలపై ప్రజలతో మాట్లాడి ఆరా తీశారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్, ఎజాస్, కౌన్సిలర్ హకీం తదితరులు ఉన్నారు.

జంతువుల దప్పిక తీరుస్తున్న నీటి కుండీలు

బాన్సువాడ రూరల్, మే 1 : భానుడి ప్రతాపానికి రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల దాటికి మానవులతో పాటు జంతువులు తల్లడిల్లిపోతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని అటవీశాఖ అధికారులు బాన్సువాడ – కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన మొండి సడాక్ గండిలో ఏర్పాటు చేసిన నీటి కుండీలు జంతువులకు దాహం తీరుస్తున్నాయి. నీటి కుండీలు ఏర్పాటు చేయడంతో కోతులు, కొండముచ్చులు నీటిని తాగుతూ దాహాన్ని తీర్చుకొంటున్నాయి. మరి కొన్ని రోజులపాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని వాతావరణశాఖ హెచ్చరిక నేపథ్యంలో నీటి కుండీల్లో నిత్యం నీళ్లు నిలువ ఉండేలా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటే మంచిదని జంతు ప్రేమికులు కోరుతున్నారు.

కృష్ణానగర్ తండా శివారులో బాన్సువాడ – కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన ఏర్పాటు చేసిన కుండీల్లో నీటిని తాగుతున్న కొండముచ్చులు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కామారెడ్డి, మే 1 : జిల్లా కేంద్రంలో సెట్విన్ కింద వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని సెట్విన్ కోఆర్డినేటర్ సయ్యద్ మొయిజుద్దీన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మొహింది కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని తెలిపారు. కోర్సు ఫీజులో 50 శాతం రాయితీతోపాటు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని పేర్కొన్నారు. కోర్సు పూర్తి చేసిన తర్వాత సెట్విన్ సంస్థ ద్వారా సర్టిఫికెట్ అందజేస్తామని, ఈ అవకాశాన్ని జిల్లా యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7386180456,7989759121 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పోగొట్టుకున్న ఫోన్ అందజేత

బాధితుడికి మొబైల్ ఫోన్‌ను అందజేస్తున్న ఎస్సై శ్రీనివాస్‌గౌడ్

మాచారెడ్డి, మే 1 : మండల కేంద్రానికి చెందిన రెడ్డిపేట స్వామి మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నాడు. వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై శ్రీనివాస్ గౌడ్ సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసి మొబైల్‌ను ట్రేస్ చేసి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఫోన్‌ను బాధితుడికి బుధవారం పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్టయితే వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని కోరారు.

జిల్లాలో 30 యాక్ట్ అమలు

కామారెడ్డి, మే 1 : జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ 1861ని అమలు చేస్తున్న ఎస్పీ సింధుశర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా మే 1 నుంచి 31వ తేది వరకు 30 యాక్ట్, పోలీసు యాక్ట్ 1861 జిల్లాలో అమలులో ఉన్నందున రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు ఎవరైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలనుకుంటే స్థానిక పోలీసు స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలింగ్ బూత్ పరిశీలన

పెద్ద కొడప్‌గల్, మే 1: మండలంలోని అంజని గ్రామంలో ఉన్న పోలింగ్ బూత్‌ను ఎంపీడీవో సూర్యకాంత్ బుధవారం పరిశీలించారు. లోక్‌సభ ఎన్నికల నిర్వహణ కోసం కావాల్సిన సౌకర్యాలను కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పోచారం గ్రామంలో ఏర్పాటు చేసిన మినీ వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ప్రతిరోజూ వాటర్ ట్యాంక్‌ను శుభ్రం చేయించాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

హ్యాండ్‌బాల్ వేసవి శిక్షణా శిబిరం ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, మే 1: మండలంలోని మత్తమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హ్యాండ్‌బాల్ వేసవి శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా యువజన క్రీడాధికారి ఆదేశాల మేరకు హ్యాండ్‌బాల్ శిబిరాన్ని ప్రారంభించినట్లు గ్రామ ప్రత్యేకాధికారిణి డాక్టర్ అర్చన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొని రాణించాలని సూచించారు. 14ఏండ్లలోపు ఉన్న బాలబాలికలకు మే 31వ తేదీవరకు శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, బాలబాలికలు పాల్గొన్నారు.

శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న గ్రామ ప్రత్యేకాధికారిణి డాక్టర్ అర్చన

బెల్టుషాపుపై దాడి

ఎల్లారెడ్డి రూరల్, మే 1: మండలంలోని హాజీపూర్ తండాలో నిర్వహిస్తున్న బెల్టుషాపును తనిఖీ చేయగా.. మద్యం లభించిందని ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. మంగళవారం రాత్రి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు హాజీపూర్ తండాకు చెందిన సబావత్ మున్యా దుకాణాన్ని తనిఖీ చేశామన్నారు. దుకాణంలో రూ.2,986 విలువైన మద్యం లభించిందన్నారు. మద్యాన్ని సీజ్ చేసి మున్యాపై సుమోటో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

విద్యార్థినికి సన్మానం

ఎల్లారెడ్డి రూరల్, మే 1: పదో తరగతి పరీక్షలో 10 జీపీఏ సాధించిన బోలుగారి హారికను జడ్పీటీసీ ఊషాగౌడ్ మంగళవారం రాత్రి ఘనంగా సన్మానించారు. మండలంలోని దావల్‌మల్కాపల్లి గ్రామానికి చెందిన హారిక పట్టణంలోని జీవదాన్ కాన్వెంట్‌లో చదివి 10 జీపీఏ సాధించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి సొసైటీ డైరెక్టర్ గోపీకృష్ణ, సత్యనారాయణ, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

హారికను సన్మానిస్తున్న జడ్పీటీసీ ఊషాగౌడ్

బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే బైక్ ర్యాలీ

రామారెడ్డి, మే 1: ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సదాశివనగర్ మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు ఆయనకు బొట్టు పెట్టి స్వాగతం పలికారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం

ఎల్లారెడ్డిలో జెండాను ఆవిష్కరిస్తున్న కార్మికులు

గాంధారిలో

కామారెడ్డి/ బాన్సువాడ టౌన్/ ఎల్లారెడ్డి/ గాంధారి, మే 1: జిల్లా కేంద్రంలో మేడేను పలు కార్మిక సంఘాలు ఘనంగా నిర్వహించాయి. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో, విద్యుత్ కార్యాలయంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. విద్యుత్ యూనియన్ నాయకులు క్యాసంపల్లిలోని వృద్ధాశ్రమంలో బియ్యం, పప్పులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు వీ.ఎల్.నరసింహారెడ్డి, జిల్లా కార్యదర్శి బాలరాజు, జిల్లా అధ్యక్షుడు రాజు, దశరథ్, కార్మిక సంఘాల నాయకులు, 1104 విద్యుత్ యూనియన్ అధ్యక్షుడు కమలాకర్, నాయకులు జగదీశ్, పర్వయ్య, రాములు, లింగం తదితరులు పాల్గొన్నారు. బాన్సువాడలోని సీపీఐ, ఏఐటీయూసీ కార్యాలయాల వద్ద కార్మికుల జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజకవర్గం ఇన్‌చార్జి దుబాస్ రాములు, కార్మికులు పాల్గొన్నారు.

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని గాంధారితో పాటు దుర్గం తదితర గ్రామాల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. దుర్గం గ్రామంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సతీశ్ కార్మిక జెండాను ఆవిష్కరించారు. కార్మికులు ఐక్యంగా ఉంటూ తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు మోజీరామ్, రైతు కూలీ సంఘం నాయకులు మల్లేశం,శంభు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలోని మున్సిపాలిటీ కార్యాలయం ప్రాంగణంలో బల్దియా కార్మికులు మేడే సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులను సన్మానించారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో బీడీఎస్ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్ల సాయికృష్ణ, బీఎల్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు. బీడీ వర్కర్స్ కాలనీ సమీపంలో భవన నిర్మాణ రంగం కార్మికులు మేడే జెండాను ఆవిష్కరించారు. నాయకులు మర్లు సాయిబాబా, సాయిలు, కాంతారావు, లక్ష్మణ్, శ్యామ్, శ్రీను, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డిలోని విద్యుత్ కార్యాలయంలో..

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED

★SR అక్వా సొల్యూషన్స్, నిజామాబాద్ వాటర్ ప్యూరి ఫైయర్స్ నందు పనిచేయుటకు టెక్నిషియన్ (Male) కావలెను. Qual: ఇంటర్, జీతం + ఇన్సెంటివ్ సంప్ర॥ ✆ 98482 68883
NTZ-324910

WANTED

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16k to 18k, ఏజెంట్ కమీషన్ 6k. Ph: 9640258899, 9640468899
NT-311845-All

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

గ్రామాల్లో జోరుగా బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, మే 1: కొత్త సంక్షేమ పథకాలు, హామీల సంగతి అటుంచి.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలు కొనసాగితే చాలు అని ప్రజలు అనుకుంటున్నట్లు బీఆర్ఎస్ లింగంపేట మండల అధ్యక్షుడు దివిటి రమేశ్ అన్నారు. లింగంపేట మండలంలోని కోమటిపల్లి, పోతాయిపల్లి గ్రామాల్లో ఉపాధికూలీలు, ప్రజలను ఇంటింటికీ వెళ్లి కలుస్తూ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రజలు తాము కాంగ్రెస్‌కు ఓటేసి మోసపోయినట్లు గ్రహించారని ఆయన అన్నారు. రెండు గ్రామాల్లో బీఆర్ఎస్ కరపత్రాలు, కారు గుర్తు స్లిప్పులను ఓటర్లకు అందజేశారు. కారు గుర్తుకు ఓటేసి జహీరాబాద్ ఎంపీగా గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో మాజీ ఎంపీపీ ముదాం సాయిలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బేగంపూర్‌లో రసవత్తరంగా కుస్తీ పోటీలు

పెద్దకొడప్‌గల్, మే 1: మండలంలోని బేగంపూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. గ్రామంలో బారడి పోచమ్మ పండుగ సందర్భంగా కుస్తీ పోటీలను నిర్వహించినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రతి సంవత్సరం బారడి పోచమ్మ పండుగను ఘనంగా నిర్వహిస్తామన్నారు. పోటీల్లో తలపడేందుకు పిట్లం, బిచ్కుంద, మద్నూర్, బోధన్, కంగ్టి, నారాయణఖేడ్ మండలాలతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక నుంచి మల్లయోధులు తరలివచ్చారు. పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతులను అందజేశారు. మాజీ సర్పంచ్ శివరాం, హన్మాండ్లు, జూకంటి ఓంకార్, సుధీకర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పరిశీలన

ఎల్లారెడ్డి, మే 1: ఎల్లారెడ్డిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ట్రాన్స్‌కో జిల్లా ఎస్ఈ రమేశ్‌బాబు బుధవారం పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లో పలు సమస్యలు ఏర్పడడంతో ఆయన సందర్శించారు. విద్యుత్ సరఫరా, 11కేవీ ఫీడర్స్ ట్రిప్పింగ్, డబుల్ ఎర్తింగ్ వంటి సమస్యలపై ఆయన సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయనవెంట ఎల్లారెడ్డి ట్రాన్స్‌కో డీఈఈ గణేశ్, ఏడీఈ సుదర్శన్‌రెడ్డి, ఏఈ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్ఈ రమేశ్‌బాబు

అంగన్‌వాడీలో పిల్లల కొలతల సేకరణ

బాలుడి బరువును తూకం వేస్తున్న అంగన్‌వాడీ టీచర్

ఎల్లారెడ్డి రూరల్, మే 1: మండలంలోని మల్లయ్యపల్లి అంగన్‌వాడీలో పిల్లల ఎత్తు, బరువు వివరాలను సేకరించినట్లు అంగన్‌వాడీ టీచర్ సంతోష తెలిపారు. బుధవారం అంగన్‌వాడీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆరు నెలల నుంచి మూడేండ్లు ఉన్న మొత్తం 19 మంది చిన్నారుల ఎత్తు, బరువు కొలతలు తీసుకున్నామని చెప్పారు. బాలింతలు, పిల్లలకు వచ్చే సూది మందు, పోషకాహారం గురించి అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్త సునంద, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.